
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 19 ఆగస్టు 2024





మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం

నదులున్నా.. అంతేనా?

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వర్షాభావం
- దెబ్బతిన్న ఓపెన్‌హెడ్ చానెళ్లు, గ్రోయిన్లు
- పూర్తికాని ఉబాలు.. ఆందోళనలో రైతులు
- వంశధార జలాలు వస్తేనే న్యాయం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు




● ఇచ్ఛాపురం మండలంలో బహుదా నది పరిస్థితి ఇది. కొద్దిరోజులుగా ఈ నదిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగి నది నీటి ప్రవాహ గమనం మారుతోంది. దీనికితోడు ఒడిశాలో ప్రాజెక్టులను నిర్మిస్తుండడంతో నదిలో నీటి లభ్యత ఆశాజనకంగా లేదు. బహుదా నదిపై ఉన్న 11 ఓపెన్‌హెడ్ చానెల్స్‌కు చుక్క నీరు చేరడం లేదు.

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాగునీటి వనరులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రస్తుత ఖరీఫ్ వేళ సాగునీరు లేక.. ఇప్పటివరకూ ఉబాలు పూర్తికాక రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో మహేంద్రతనయా, బాహుదా నదులు ప్రధాన సాగునీటి వనరులు. మరో 200 వరకూ చెరువులున్నాయి. పైడిగాం, బాహుదా ఓపెన్‌హెడ్ చానెళ్లు 11 ఉన్నాయి. వాటి పరిధిలో పదుల సంఖ్యలో గ్రోయిన్లు ఉన్నాయి. సీతసాగరం, పొత్రఖండ-కర్తలిపాలెం సాగరం, గంగాసాగరం, గోవిందసాగరం, సుంకిడి సాగరం వంటి సాగునీటి వనరులు ఉన్నాయి. కానీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మూలకు చేరాయి. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులకు శాపంగా మారింది. ఏటా సకాలంలో సాగునీరు అందక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బాహుదా నది ద్వారా ఇచ్ఛాపురం మండలంలో 15 పంచాయతీల్లో సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందేది. ఈ నదిపై 11 చోట్ల ఓపెన్‌హెడ్ చానెళ్లను ఏర్పాటుచేశారు. గ్రోయిన్ల ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. ఓపెన్ హెడ్ చానెళ్లు, గ్రోయిన్లు దెబ్బతినడంతో రైతులే సొంతంగా డబ్బులు వేసుకొని బాగు చేసుకోవాల్సి వస్తోంది. ఎగువ ప్రాంతంలోని ఒడిశాలో భలగబట్టి ప్రాంతంలో నదిపై ప్రాజెక్టును నిర్మించారు. దీని ఎత్తు 106 మీటర్లుకాగా.. ప్రాజెక్టు నిండనదే కిందకు నీరు విడిచిపెట్టరు. దీనికితోడు ఏపీ భూభాగంలో నదిలో దారుణంగా రెల్లి గెడ్డ ఉంది. చెత్త పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహ గమనానికి అడ్డంగా మారుతోంది.

● సోంపేట మండలం శాసనం వద్ద మహేంద్రతనయా నది పరిస్థితి ఇది. ఎగువన ఒడిశాలో నదిపై సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. దీంతో నదిలో నీటి లభ్యత అంతంతమాత్రమే. ప్రస్తుతం నది పరిధిలో గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. గ్రోయిన్లు, ఎత్తిపోతల పథకాలు సైతం సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో సోంపేట, మందస మండలాల రైతులకు శాపంగా మారింది.



● పైడిగాం.. దయనీయం

మహేంద్రతనయా నదిపై సోంపేట మండలం బాతుపురం సమీపంలో నిర్మించిన పైడిగాం ప్రాజెక్టు 2018లో తితలీ తుపానుకు కొట్టుకుపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్ప.. ప్రాజెక్టు నిర్మాణం మాత్రం చేపట్టలేదు. రూ.36కోట్లతో ప్రాజెక్టును ఆధునికీకరించ నున్నట్టు ప్రకటించారు. కానీ పనులు మాత్రం చేపట్టలేదు. ఎగువ ప్రాంతంలో పురియాసాయి వద్ద ఒడిశా ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. దీంతో 185 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా.. కనీసం 40 క్యూసెక్కుల నీరు కూడా చేరడం లేదు. తూర్పు కనుమల నుంచి వచ్చే వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా లడ్డగుడ్డి వద్ద మినీ రిజర్వాయర్ నిర్మిస్తే.. ఆ నీటిని కాలువలకు మళ్లిస్తే మాత్రం అదనంగా 6 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.

ఇచ్ఛాపురం వరకూ వంశధార తెస్తేనే..

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి శాశ్వత తాగునీటి పరిష్కారమార్గం దొరకడం లేదు. ఏటా ఖరీఫ్‌లో వర్షాల కోసం ఎదురుచూపులు మిగులుతున్నాయి. వంశధార జలాలను ఇచ్ఛాపురం నియోజకవర్గానికి తీసుకొస్తే సాగునీటి ఇబ్బందులను తొలగించవచ్చు. ఇప్పటికే పలాస నియోజకవర్గంలోని కిడిసింగి వరకూ వంశధార ఎడమ ప్రధాన కాలువ విస్తరించి ఉంది. దానిని ఇచ్ఛాపురం వరకూ 50 కిలోమీటర్ల మేర పొడిగిస్తే నియోజకవర్గానికి మహర్దశే. నీరు నిల్వ చేసుకునేందుకు చెరువులు, సాగరాలు ఉండడంతో ఖరీఫ్, రబీకి సాగునీటి సమస్య లేకుండా చేయవచ్చు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండడం, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి కావడంతో సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంశధార జలాలను తేవాలి

ఇచ్ఛాపురం నియోజకవర్గంపై గత వైసీపీ ప్రభుత్వం శీతకన్ను వేసింది. సాగునీటి వనరులు ధ్వంసమయ్యాయి. ఈ ఏడాది కనీస స్థాయిలో ఉబాలు జరగలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వంశధార జలాలను ఇచ్ఛాపురం నియోజకవర్గానికి తెచ్చేందుకు కృషి చేయాలి.

-వరప్రసాద్, రైతు సంఘం అధ్యక్షుడు, ఇచ్ఛాపురం

సీఎం దృష్టికి తీసుకెళ్లాం



ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాగునీటి ఇబ్బందులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. వంశధార జలాలను ఇచ్ఛాపురం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.

- బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

షట్టర్లు లేక అవస్థలు..

నరసన్నపేట: నరసన్నపేట బ్రాంచ్ కాలువపై పలు ప్రాంతాల్లో షట్టర్లు లేక రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కంబకాయి, కరగాం, నర్సింగపల్లి, రెడ్డికపేట, సత్యవరం, గొట్టిపల్లి, జమ్ము, దేశవానిపేట, బొరిగివలస, కిల్లాం, మాకివలస తదితర గ్రామాలకు కాలువల ద్వారా సాగునీరు అందేది. కాగా.. షట్టర్లు లేక తగినంత సామర్థ్యంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. వంశధార కాలువలపై 2007లో షట్టర్లు, వంతెనలు ఏర్పాటు చేయకుండా.. చేసినట్టు రూ.52కోట్ల మేర కుంభకోణం జరిగింది. అప్పటి నుంచీ షట్టర్ల వ్యవహారం కేసు కోర్టులో ఉంది. దీంతో కాలువలపై షట్టర్లు ఏర్పాటు చేయలేదు. ఏటా వర్షాలు తగ్గుముఖం పట్టే సమయాల్లో శివారుప్రాంత రైతులు షట్టర్ల స్థానంలో తాటిచెట్టు, గడ్డి పెడుతూ నీరు తీసుకువెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. గత ఐదేళ్లు వైసీపీ పట్టించుకోలేదని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా సమస్య పరిష్కారానికి చొరవచూపాలని రైతులు కోరుతున్నారు. పిల్ల కాలువలపై షట్టర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


జమ్ము వద్ద ఎన్టీసీ కాలువపై షట్టర్లు లేక దిగువకు వెళ్తున్న నీరు

● ఎత్తిపోతలు ఇలా..

● కోటబొమ్మాళి మండలం కొత్తపేట ఎత్తిపోతల పథకం ద్వారా 800 ఎకరాలకు సాగునీరు అందించాలి. కానీ ఆ పథకం నిర్వహణ లేక రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

● కోటబొమ్మాళి మండలం తర్లిపేట వద్ద 160కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి వైండింగ్ కాలిపోవడంతో ఆ పథకం కొండెక్కింది.

● టెక్కలి మండలం నర్సింగపల్లి, మొఖలింగాపురం, గూడేం, నందిగాం మండలం రాం పురం, రథజనబొడ్డపాడు, నౌగాం పంచాయతీ లకు సంబంధించి 3,300 ఎకరాలకు సాగునీరు అందించే మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి 1000 కేవీఏ ట్రాన్స్‌పా ర్మర్లు మూడు చోరీకి గురయ్యాయి. 63కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి రాగివైరు, డీపీ ఆయిల్ కూడా చోరీ కావడంతో వేలాది మంది రైతులకు సాగునీరు అందని దుస్థితి.

● కోటబొమ్మాళి మండలం కురుడు-కొండపేట ఎత్తిపోతల పథకం.. 2,500 ఎకరాలకు సాగునీరందించేది. పైపులైన్ లీకేజ్ కారణంగా నాలుగేళ్లుగా ఈ పథకం మూలకు చేరింది.

● పాతపట్నం-కళింగపట్నం రోడ్డు విస్తరణలో గడ్డయ్యపేట ఎత్తిపోతల పథకం ధ్వంసమైంది.

సాగునీటికి పాట్లు

- సక్రమంగా పనిచేయని ఎత్తిపోతల పథకాలు
- వైసీపీ పాలనలో కానరాని నిర్వహణ
- రైతులకు తప్పని ఇబ్బందులు

(టెక్కలి)

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఎత్తిపోతల పథకాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. మెట్ట భూముల రైతులకు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో సుమారు 26 ఎత్తిపోతల పథకాల ద్వారా.. 29,245 ఎకరాలకు సాగునీరు అందించారు. కాగా గడిచిన ఐదేళ్లలో ఆ ఎత్తిపోతల పథకాలు పలుచోట్ల పాడైపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు, డీపీ ఆయిల్ చోరీకి గురయ్యాయి. కనీస నిర్వహణ లేక 14 ఎత్తిపోతల పథకాలు పడకేశాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక.. ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందక.. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్నిచోట్ల రైతులు స్వచ్ఛందంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కోటబొమ్మాళి మండలం ఉప్పరపేటకు చెందిన చదునుపల్లి అప్పన్న.. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను నారాయణపురం ఎత్తిపోతల పథకానికి అందించారు. దీంతో ఆ ప్రాంతంలో 800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే హిరమండలం సమీపాన కిట్టాలపాడు ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో రైతులు చందాలు వేసుకున్నారు. ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను మూడు నెలలకుగానూ రూ.1.50 లక్షలకు అద్దెకు తెచ్చి.. 600 ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం చేశారు.

● ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ..

హిరమండలం, సారవకోట, జలుమూరు, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం మండలాల్లో ఇటీవల తొమ్మిది ఎత్తిపోతల పథకాలకు సంబంధించి 13 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో సుమారు కోటి రూపాయల విలువైన రాగివైరు, డీపీ ఆయిల్ చోరీకి గురయ్యాయి. హిరమండలం సమీపాన కిట్టాలపాడులో 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, తొగిరిలోని 630కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, టెక్కలిపాడులోని 315కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, సొడాంలోని 400కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు, చిన్నసానలోని 500కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు, మదనగోపాలసాగరంలోని 1000కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు, 63కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, పిట్టలసరియాలో 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, సుభద్రాపురంలో 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, నారాయణపురంలో 400కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి రాగివైరు, డీపీ ఆయిల్ చోరీ అయ్యాయి. వీటిపై ఆయా పోలీస్‌స్టేషన్లలో ఏపీఎస్ఐడీసీ అధికారులు ఫిర్యాదులు చేశారు.

● రూ.30 కోట్ల విద్యుత్ బకాయిలు

జిల్లాలో రోజుకి 16 గంటలు విద్యుత్ సరఫరా చేసే 37 హెచ్‌టీ లైన్ ఎత్తిపోతల పథకాలు, తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేసే నాలుగు ఎల్‌టీ లైన్ ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వంశధార ప్రధాన ఎడమ కాలువ పరిధిలో 25 ఎత్తిపోతల పథకాలు ఉండడం విశేషం. వీటి ద్వారా 391.16 క్యూసెక్కుల సాగునీరు 29,247 ఎకరాలకు అందించాలి. కాగా ఈ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి గత ఐదేళ్లుగా రూ.30కోట్లకుపైగా విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ఈ పథకాలు పర్యవేక్షణ నిర్వహించే ఏపీఎస్ఐడీసీ సిబ్బందికి సైతం జీతభత్యాలు కూడా అందడం లేదు.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం ఏపీఎస్ఐడీసీకి ప్రత్యేక జీవో ద్వారా రూ.80 లక్షలు నిధులు మంజూరు చేశారు. విజయవాడకు చెందిన జీఎస్ ఎలక్ట్రికల్స్ సంస్థ ఈ టెండర్లను దక్కించుకుంది. ఇందుకు సంబంధించి ఫైనాన్షియల్ ఆమోదం, ప్రొసీడింగ్స్ అనంతరం అగ్రిమెంట్ చేయాల్సి ఉంది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుల ప్రక్రియ జాప్యమవుతోంది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని జీఎస్ ఎలక్ట్రికల్ సంస్థకు మంత్రి అచ్చెన్న ఆదేశించారు.

● ఈ విషయమై ఏపీఎస్ఐడీసీ ఇన్‌చార్జి ఈఈ ఎం.కామరాజు వద్ద ప్రస్తావించగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు జీఎస్ ఎలక్ట్రికల్ సంస్థ ప్రతినిధులు రెండు, మూడురోజుల్లో పనులు చేపడతారని తెలిపారు. నెలరోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సాగునీరు అందిస్తామన్నారు.

శ్రీకాకుళం డీఎస్పీగా వివేకానంద



శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ క్రైం, ఆగస్టు 18: రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా శ్రీకాకుళం డీఎస్పీగా సీహెచ్ వివేకానందను నియమిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం శ్రీకాకుళం డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వైశృతి స్థానంలో వివేకానందను నియమించారు. విశాఖపట్నంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న వివేకానంద 1991 ఎస్ఐ బ్యాచ్‌కి చెందినవారు. 2015లో శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. అప్పటి ఎస్పీ ఏఎస్‌ఖాన్ నాయకత్వంలో పేకాట, బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక నిఘా నిఘా ఉంచారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. అలాగే శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఏ.త్రినాథరావును విశాఖపట్నం డీఎస్ఆర్బీ విభాగానికి బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

కొత్త రేషన్‌కార్డులు వస్తున్నాయ్!

మెళియాపుట్టికి చెందిన డోల క్రాంతికుమార్‌కు ఆరేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇంతవరకూ మంజూరు కాలేదు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసినా.. రేషన్‌కార్డు లేక తిరస్కరించారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

మెళియాపుట్టి మండల జలగలింగుపురం గ్రామానికి చెందిన గొర్లె బాలకృష్ణకు నాలుగేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంతవరకూ రేషన్‌కార్డు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా రేషన్‌కార్డు మంజూరు కాలేదని వాపోతున్నారు.

(మెళియాపుట్టి)

జిల్లాకు కొత్తరేషన్ కార్డులు రానున్నాయి. త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ప్రకటించారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో ప్రస్తుతం 6,71,803 రేషన్‌కార్డులు ఉన్నాయి. 1,603 డిపోలు ఉన్నాయి. ప్రతి నెలా 422 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులను.. బియ్యం కార్డులుగా మార్చింది. వాటిపై అప్పటి సీఎం జగన్ చిత్రాన్ని ముద్రించింది. ఏడాదికి రెండుసార్లు కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయనున్నట్టు ప్రకటించింది. కానీ, ఆచరణకు నోచుకోలేదు. రేషన్‌కార్డు మంజూరులో ఎన్నో ఆంక్షలు పెట్టింది. కార్డులో సభ్యుల పేర్లు తొలగించడానికి.. సంబంధిత వ్యక్తే ఉండాలని నిబంధన పెట్టింది. వలస జీవులు అందుబాటులో లేక.. మరోవైపు సాంకేతిక సమస్యతో చాలా మందికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. జిల్లాలో సుమారు 30 వేలమంది వరకూ దరఖాస్తుదారులు రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో ప్రక్రియ ప్రారంభం అవుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.


రేషన్ సరుకుల పంపిణీ(ఫైల్)

ఆదివాసీల హక్కులను రక్షించాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్

పలాస రూరల్, ఆగస్టు 18: ఆదివాసీల హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చిననీలావతిలో ఆదివాసీ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆదివాసీల హక్కుల పోరాట సంఘీభావ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసి కార్పొరేట్ శక్తులకు అందించేలా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత మూడు నెలలుగా ఆపరేషన్ కాగర్(ది ఫైనల్ మిషన్) పేరుతో అడవుల్లో దండయాత్రలు సాగదీస్తూ దురాక్రమణకు పాల్పడుతున్నారని విమర్శించారు. సహజ వనరులను కొల్లగొట్టే కంపెనీలకు అడవులను అం దజేస్తూ ఆదివాసీలకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు, పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వినోద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ అధ్యక్షుడు జోగి కోదండ, ప్రజా కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు కెనీల కంఠం, మహిళ సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్



ప్రధాన రహదారిపై ఎర్రజెండాలు

సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఎర్రజెండాలు వెలిశాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నిత్యం వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. దీంతో రోడ్లు భవనాలశాఖ అధికారులు ఈ గుంతల్లో గ్రావెల్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఈ గ్రావెల్ వేసిన ప్రాంతంలో వాహనాలు కూరుకుపోతున్నాయి. దీంతో స్థానిక ఆటో యూనియన్ సభ్యులు గ్రావెల్ వేసిన గుంతపై నుంచి వాహనాలు రాకపోకలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా ఎర్రజెండాలు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. వాహనదారులు ఈ ప్రాంతానికి రాగానే ఎర్రజెండాలను చూసి పక్కనే ఆర్టీసీ బస్టాండ్ రహదారిని దాటుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

- సరుబుజ్జిలి



పది నిమిషాలు ఆగలేరా..

కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద దృశ్యమిది. రైల్వేగేటు వేసిన తరువాత కింద నుంచి వాహనదారులు, పాదచారులు ఎవరూ వెళ్లకూడదు. దీనిపై రైల్వే రక్షకదళం చర్యలు తీసుకుంటే.. జరిమానా, జైలు పడుతుంది. అయితే అనేకమంది గేటు వేసిన తరువాత ఆగకుండా కింది నుంచి అతి కష్టంపై వెళ్తూ కోరి ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు. రైళ్లు వచ్చినప్పుడు ఎల్‌సీ గేటు పడితే.. దానిని తీసేందుకు కనీసం 20 నిమిషాల సమయం పడుతుంది. ఒక్కోసారి ఒక రైలు ఉన్నప్పుడు మాత్రం కేవలం పది నిమిషాలు గేటు వేసి మళ్లీ తెరుస్తారు. కానీ చాలామంది వాహనాదారులు ఆ పది నిమిషాలు నిరీక్షించలేక.. గేటు కింద నుంచి దూరి.. రాకపోకలు సాగిస్తున్నారు. ఇటువంటి సమయాల్లో కొందరు రైలుకింద పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

- పలాస

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

1. తేజకు అతని సోదరి నందిత పుట్టినరోజు జూలై 21 నుంచి జూలై 26 మధ్య అని గుర్తు. మరో సోదరుడు భవేష్‌కు వారి సోదరి పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. అయితే నందిత పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జూలై 26 బి) జూలై 25
సి) జూలై 24 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తేజకు అతని సోదరి పుట్టినరోజు జూలై 21 నుంచి 26 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు తీసుకోవాలి. 22, 23, 24, 25 భవేష్‌కు, సోదరి నందిత పుట్టినరోజు జూలై 24 నుంచి 29 మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్యలోని తేదీలు 25, 26, 27, 28.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉండే తేదీ '25' అనగా జూలై 25 సమాధానం అవుతుంది.

2. సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 12 మధ్య అని గుర్తు. అతని సోదరి సౌమికకు వారి తల్లితండ్రుల పెళ్లిరోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 4 మధ్య అని గుర్తు. అతని సాత్విక్, సౌమికల తల్లిదండ్రుల పెళ్లిరోజు అవుతుంది?

ఎ) అక్టోబర్ 10 బి) అక్టోబర్ 11
సి) అక్టోబర్ 10 లేదా 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: సాత్విక్‌కు అతని తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 7 నుంచి 12కు మధ్య అని గుర్తు. ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 8, 9, 10, 11. అతను సోదరి సౌమికకు వారి తల్లిదండ్రుల పెళ్లి రోజు అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14కు మధ్య అని గుర్తు, ఇచ్చిన తేదీలకు మధ్య తేదీలు 10, 11, 12, 13.

గమనించండి: రెండింటిలో కామన్‌గా ఉన్న తేదీలు 10, 11. ఈ విధంగా రెండు తేదీలు వచ్చినప్పుడు అక్టోబర్ 10 లేదా అక్టోబర్ 11 (అనగా either, or)) సమాధానంగా గుర్తించాలి.

3. పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుంచి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరో సోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 26ల మధ్య అని గుర్తు. అయిన పవిత్ర మౌనికల ప్రకారం వారి సోదరి మేఘన పుట్టినరోజు ఏ రోజు అవుతుంది?

ఎ) జనవరి 23 బి) ఫిబ్రవరి 23
సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: పవిత్రకు ఆమె సోదరి మేఘన పుట్టినరోజు జనవరి 20 నుండి జనవరి 24 మధ్య అని గుర్తు. వారి మరోసోదరి మౌనికకు, మేఘన పుట్టినరోజు ఫిబ్రవరి 22, ఫిబ్రవరి 24ల మధ్య అని గుర్తు.

గమనించండి: ఇద్దరి సమాచారం ప్రకారం నెలలు వేర్వేరుగా ఉన్నాయి. దాదాపు 30 రోజుల తేడా ఉన్నది. కావున సమాధానం చెప్పలేం అవుతుంది.

4. ఒక బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని.లకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది. తరవాత బస్సు 11.30 ఎ.ఎం. అని చెప్పారు. అయిన ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికునితో ఏ సమయంలో చెప్పారు?


ఎ) 10.50 ఎ.ఎం. బి) 11.00 ఎ.ఎం.
సి) 11.10 ఎ.ఎం. డి) 11.15 ఎ.ఎం.

సమాధానం: (బి)

వివరణ: బస్సు వరంగల్‌కు ప్రతి 45 ని. ఉంది. తదుపరి బస్సు వచ్చే సమయం గం. 11.30 ని. అనగా ముందు బస్సు వచ్చిన సమయం 11.30-45 ని. = గం. 10.45 ని. విచారణాధికారి ప్రయాణికునితో బస్సు వెళ్ళిపోయి 15 ని. అయింది అని చెప్పారు. దాని అర్థం ప్రయాణికుడు 15 ని. ఆలస్యంగా వచ్చాడు. (ఆలస్యంగా వస్తేనే కదా బస్సు వెళ్ళి పోయింది) కాబట్టి విచారణాధికారికి, ప్రయాణికునికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.45+15 ని.= 11.00 ఎ.ఎం. అవుతుంది.

5. ఒక కార్యాలయంలో 30 మంది ఉద్యోగులు ఉన్నారు. 10 మంది ఉద్యోగులు మొదటి గ్రూపుగా ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 1.00 గం. వరకు పని చేస్తారు. 12 మంది వ్యక్తులు రెండో గ్రూపుగా ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గం. వరకు పనిచేస్తారు. 8 మంది వ్యక్తులు మూడో గ్రూపుగా ఉదయం 11.00 గం.ల నుంచి సాయంత్రం 5 గం. పనిచేస్తారు. అయితే కార్యాలయంలోని ఉద్యోగులందరూ ఏ సమయం నుంచి ఏ సమయం వరకు కలుసుకుంటారు?

ఎ) 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.



బి) 10 ఎ.ఎం. నుంచి 12 మధ్యాహ్నం
సి) 1 పి.ఎం. నుంచి 3 పి.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: కార్యాలయంలో ఉద్యోగులందరు కలుసుకునే సమయం అనగా మూడు గ్రూపుల వారికి కామన్ టైమ్ తీసుకోవాలి. మొదటి గ్రూపు పని చేసే వేళలు 7.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం.వరకు అనగా 7-8, 8-9, 9-10, 10-11, 11-12, 12-11

రెండో గ్రూపువారు పనిచేసే వేళలు 9.00 ఎ.ఎం. నుంచి 3.00 పి.ఎం. వరకు అనగా 9-10, 10-11, 11-12, 12-1, 1-2, 2-3. మూడో గ్రూపువారు పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 5.00 పి.ఎం. వరకు అనగా 11-12, 12-1, 1-2, 2-3, 3-4, 4-5. **గమనించండి:** మూడు గ్రూపులలో కామన్ టైమ్ 11 నుంచి 1 వరకు అని తెలుస్తున్నది. కాబట్టి మూడు గ్రూపులు కార్యాలయంలో కలిసి పనిచేసే వేళలు 11.00 ఎ.ఎం. నుంచి 1.00 పి.ఎం. సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎస్సీ ఉప వర్గీకరణ
సుప్రీంకోర్టు తీర్పు-నేపథ్యం

భారతీయ సమాజంలో అసమానతలకు బీజం వేసింది నాలుగంచెల చాతుర్వర్ణ వ్యవస్థ. ఎగువ అంచెల వారి కి పాలనాధికారాన్ని, ప్రతిష్ఠను కట్టబెట్టి దిగువ అంచెల వారిని వారికి సేవకులను చేసింది. అన్నింటికన్నా దిగువ అంచె అయిన శూద్రుల్లో సేవక కులాలనన్నింటినీ జమచేయడం జరిగింది. వారి వృత్తులను బట్టి కాలక్రమంలో శూద్రుల్లో కూడా స్థాయీ భేదాలు వచ్చాయి. కొన్ని పనులు చేసేవారు అంటరాని వారయ్యారు. ఊరిలోని మాలిన్యాన్ని తొలగిస్తూ, అందరి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ తాము మాత్రం ఊరవతలకే పరిమితమయ్యారు. కనీస అవసరాలకు నోచుకోలేదు. కాలక్రమంలో వీరే దళితులుగా పిలువబడ్డారు.

స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన శూద్ర కులాల వారి అభ్యున్నతికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి పురోభివృద్ధికి బాటలు వేసింది. అయితే దళితులను(మాల, మాదిక, వారి ఆశ్రిత కులాలను) షెడ్యూల్డ్ క్యాస్ట్, వివిధ ఆదివాసీ జాతులను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా పేర్కొంటూ మూకుమ్మడి రిజర్వేషన్లను రెండు వర్గాల్లో అమలు చేశారు. అయితే తదనంతర కాలంలో అనగా 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు. ఈ వర్గీకరణ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో అనుసరించలేదు. దీని కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని కొన్ని ఆధిపత్య కులాలు, జనాభాపరంగా తక్కువ సంఖ్య ఉన్న కులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా పొందాయి. క్రమంగా వారి తరవాతి తరాలూ ఈ లబ్ధిని కొల్లగొట్టాయి. ఏబీసీల మాదిరి క్రిమిలేయర్ విధానం కూడా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో లేకపోవడంతో అభివృద్ధి చెందిన ఉప కులాలే మరింత రిజర్వేషన్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందారు. ఇతర ఉపకులాలు అణగారిపోయారు. ఎస్సీ, ఎస్టీల్లోని అనేక కులాలు, ఆశ్రిత కులాల్లో దీనిపై అసంతృప్తి ఉన్నప్పటికీ తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల్లోని మాదిగ కులం వారిలో చైతన్యం వచ్చింది.

> 90ల్లో ఇతర వెనుకబడిన కులాలకు కల్పించిన రిజర్వేషన్లలో అన్ని వర్గాలకూ రిజర్వేషన్లు మూకుమ్మడిగా కాక, ఆయా ఉపవర్గాల్లో వెనుకబాటుతనం ఆధారంగా, ఇతర వెనుకబడిన తరగతులను(ఓబీసీ) హేతుబద్ధీకరించి ఏ, బీ, సీ, డీ, ఇ లుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేశారు.

ఎస్సీ ఉపవర్గీకరణ పోరాట పుట్టినిల్లు తెలుగుగడ్డ

అనాదిగా చర్మకారులుగా అట్టడుగు స్థాయిలో ఉన్న మదిగవారు, తమ తోటి ఉపవర్గం వారితో కూడా అంటరానివారిగా చూడబడ్డారు. తమకన్నా సామాజికంగా ముందున్న మాల వారితో కలిసి ఉమ్మడిగా అవకాశాలు పంచుకోవాల్సి రావడం అన్యాయంగా గుర్తెరిగారు.

జనాభాపరంగా తమకంటే తక్కువ సంఖ్యలో ఉన్న మాల వారు ఉమ్మడి రిజర్వేషన్ల కారణంగా ఎక్కువ లబ్ధి పొందుతున్నారని గ్రహించారు. తమకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలుచేయాలని ఏడో దశకం నుంచి ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తున్నారు. అయితే 1994లో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పాటైన నాటినుంచి ఎస్సీ ఉపవర్గీకరణ పోరాటం ఉద్యమ స్థాయిని అందుకుంది. తమ పోరాటానికి 'మాదిగ దండోరా' ఉద్యమంగా నామకరణం చేశారు. వరుసగా భారీఎత్తున దండోరా సభలు, ర్యాలీలు నిర్వహించారు. ఎస్సీల్లో ఉపకులాలను వారి సామాజిక స్థాయి, జనాభా ఆధారంగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డి అనే కేటగిరీలుగా అమలు చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, సమాజం నుంచి మద్దతు కూడగట్టారు.

ఈ ఉద్యమఫలంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసి సమస్య పరిష్కారానికి సూచనలు కోరింది. 1997లో ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేవిధంగా చర్యలు తీసుకోమని సూచించింది. తత్ఫలితంగా 1997 జూన్ 6న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉన్న 15% కోటాను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా విభజిస్తూ ఒక జీవోను విడుదల చేసింది. ఏ గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలను చేర్చి 1 శాతం కోటాను, బీ గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలను చేర్చి 7శాతం కోటా, సీ గ్రూపులో మాల, దాని ఉపకులాలను చేర్చి 6శాతం కోటా, డీ గ్రూపులో ఆది ఆంధ్రులతో పాటు ఇతర కులాలను చేర్చి 1 శాతం కోటాను ఇచ్చారు. ఈవిధంగా ఏ గ్రూపును ఎస్సీల్లో అట్టడుగు కులాల గ్రూపుగా తదుపరి బీ, సీ, డీలను క్రమానుగతంగా దాని పైస్థాయి గ్రూపులుగా వర్గీకరించి ఎస్సీ రిజర్వేషన్లలో కోటాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే మాలలు ఈ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. మాల మహానాడు సంఘం ఈ రిజర్వేషన్ వర్గీకరణను న్యాయస్థానంలో సవాలు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జీవో రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రప్రభుత్వ అధికార పరిధిలో లేని విషయమని తీర్పు ఇవ్వడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. తదుపరి మరలా ఎంఆర్‌పీఎస్ పోరుబాట పట్టింది. దీంతో 2000 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం' ద్వారా తిరిగి ఎస్సీ ఉప వర్గీకరణను ప్రవేశపెట్టింది. 2004 నవంబరు వరకూ ఈవిధంగా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం అమలులో ఉంది. 2004లో ఇ.వి.చెన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో 5గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ ఉప వర్గీకరణ చెల్లదని, ప్రకరణ 341(1) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు సజాతీయ కులాలను ఎస్సీలుగా వర్గీకరించారని, దానిని తిరిగి ఉప వర్గీకరించే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు లేదని తీర్పునిచ్చింది. దీంతో మరలా కథ మొదటికి వచ్చింది. తిరిగి ఎంఆర్‌పీఎస్ ఉద్యమించడంతో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ ఉప వర్గీకరణకు పార్లమెంటు రాజ్యాంగ సవరణ చట్టం తీసుకురావాల్సిందిగా కోరుతూ అసెంబ్లీలో ఒక తీర్మానం చేసింది. దీంతో కేంద్రం 2007లో ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉపవర్గీకరణ అంశానికి సంబంధించి ఎదురయ్యే రాజ్యాంగ, చట్టపరమైన అవరోధాలను పరిశీలించి తగిన సూచనలు చేయాల్సిందిగా కోరింది. 2008లో నివేదిక సమర్పించిన ఈ కమిషన్ రాజ్యాంగ ప్రకరణ 341కి క్లాజ్ 3ని చేర్చి, రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసినప్పుడు పార్లమెంటు ఆమోదించే అవకాశాన్ని ఏర్పాటు చేయవచ్చని సూచించింది. ఈ సూచనలు అమలుకు నోచుకోలేదు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

రాజకీయాల్లో..

క్షత్రియులకు అవకాశం కల్పిస్తాం

- క్షత్రియభవన్‌కు భూమిని కేటాయిస్తాం
- క్షత్రియ సేవా సమితి.. అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్
- ప్రభాస్ సినిమాపై పొగడ్తల వర్షం
- తెలుగు సినిమాను విశ్వవ్యాప్తం చేశారని వ్యాఖ్య



క్షత్రియ సేవాసమితి అభినందన సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో క్షత్రియ సామాజికవర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, నగరంలో క్షత్రియ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని, ప్రసంగించారు. 1960లలోనే క్షత్రియులు ఆంధ్రప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వచ్చి.. ద్రాక్ష తోటలు, పౌల్ట్రీ వంటి వ్యాపారాలు నిర్వహించారని.. శ్రమ, అకుంఠిత దీక్షతో ఉన్నతస్థాయికి ఎదిగారని రేవంత్‌రెడ్డి వివరించారు. కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయవంతమవుతారన్నారు. "క్షత్రియులకు రాజకీయాల్లో తగిన ప్రోత్సాహం అందిస్తాం. మీరే తగిన పేర్లు ఇస్తే.. వారికి పార్టీ పదవులు ఇచ్చి.. కార్పొరేటర్, ఎమ్మెల్యే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తాం" అని క్షత్రియ సేవాసమితిని కోరారు. ఆంధ్రాలో అల్లూరి సీతారామరాజు, తెలంగాణలో కొమరం భీం పోరాట యోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని.. ముందుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతోపాటు ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి చేయబోతున్నామని, దానిలో కూడా రాజులు భాగస్వాములు కావాలన్నారు. పెట్టుబడులతో ముందుకొస్తే అన్నివిధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో క్షత్రియ కమ్యూనిటీ భాగస్వామ్యం ఉందన్నారు. కర్ణాటకలో రాజకీయ సమీకరణలు, పరిస్థితుల ప్రభావం వల్ల బోసురాజుకు పోటీచేసే అవకాశం రాలేదన్నారు. మంత్రివర్గం ఏర్పాటు సమయంలో మంత్రి పదవి కేటాయించాలని స్వయంగా రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి.. రాజులు క్రమశిక్షణతో పనిచేస్తారనే అభిప్రాయం అధిష్ఠానంలో ఉందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా శ్రీనివాస్‌రాజును నియమించడం రాజులపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి ప్రతీక అన్నారు. "క్షత్రియభవన్ స్థలాన్ని మేము అందిస్తాం, భవనాన్ని మీరు నిర్మించండి మళ్లీ జరిగే సమావేశం క్షత్రియ భవన్‌లో జరుపుకుందాం" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు నాగరాజు, నాని, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభాస్ సినిమాపై..

విజయానికి, విశ్వాసానికి క్షత్రియులు మారుపేరని పేర్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్.. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ప్రభాస్ కాకుండా వేరే నటుడిని బాహుబలి స్థానంలో ఊహించుకోలేమన్నారు. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో బోసురాజు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దివంగత సినీనటుడు కృష్ణంరాజుతో తనకు ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

'లేటరల్ ఎంట్రీ'తో

యువతకు అన్యాయం

- ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల నియామకం
- ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ... రిజర్వేషన్ల అంతానికి మోదీ హామీ: రాహుల్




న్యూఢిల్లీ, ఆగస్టు 18: వివిధ మంత్రిత్వ శాఖల్లో పోస్టులను లేటరల్ ఎంట్రీ విధానంలో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. యూపీఎస్సీకి బదులు ఆరెస్సెస్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమిస్తూ రాజ్యాంగంపై ప్రధాని మోదీ దాడి చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బహిరంగంగానే లాక్కుంటున్నారని ఆయన ఆదివారం 'ఎక్స్'లో ఆరోపించారు. లేటరల్ ఎంట్రీలో ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకోవడం జాతి వ్యతిరేక చర్యని ధ్వజమెత్తారు. 'అణగారిన వర్గాలకు ఉన్నత స్థానాల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఎప్పటినుంచో చెబుతున్నాం. దాన్ని మెరుగుపరచడానికి బదులు లేటరల్ ఎంట్రీ పేరుతో వారిని ఉన్నత పదవులకు మరింత దూరం చేస్తున్నారు. ఇది యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులు కాలరాయడమే. అణగారిన వర్గాలకు రిజర్వేషన్లతో సహా సామాజిక న్యాయం అనే భావనపై దాడి చేస్తున్నారు. నిర్ణయాత్మక ప్రభుత్వ పదవుల్లో కూర్చోవడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారో చెప్పడానికి సెబీ ఒక స్పష్టమైన ఉదాహరణ. పాలనా వ్యవస్థను, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే ఈ జాతి వ్యతిరేక చర్యను ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఐఏఎస్‌ల ప్రైవేటీకరణ అనేది రిజర్వేషన్ల రద్దుకు మోదీ హామీ అని ఆయన దుయ్యబట్టారు.

అక్టోబరు 2 నుంచి ఆందోళన: అఖిలేశ్

లేటరల్ ఎంట్రీ విధానం అమలును సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ తప్పుబట్టాయి. బీజేపీ చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ట్వీట్ చేశారు. దీనిపై అక్టోబరు 2నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వారి కోటా ప్రకారం నియామకాలు చేపట్టకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ విధానం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని, ఇది రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వివిధ శాఖల్లోని జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల వంటి కీలక పోస్టుల్లో 45 మందిని లేటరల్ ఎంట్రీ విధానంలో నియామకానికి యూపీఎస్సీ శనివారం దరఖాస్తులు ఆహ్వానించింది.

కమల కంటే నేనే అందంగా ఉంటా..



పెన్సిల్వేనియా, ఆగస్టు 18: అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. పెన్సిల్వేనియాలోని విల్కేస్- బారిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతూ, కమలా హారిస్ నవ్వు భయంకరంగా ఉంటుందని, ఆమె కంటే తానే అందంగా ఉంటానని వ్యాఖ్యానించారు. టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీపై కమలా హారిస్ ఫొటోను ముద్రించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం! సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో బ్లింకెన్ భేటీ కానున్నారు.

బ్లింకెన్ పర్యటన వేళ..
గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గాజాస్ట్రిప్, ఆగస్టు 18: అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ పర్యటన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. శనివారం అర్ధరాత్రి నుంచి జరిగిన బాంబింగ్‌లో 19 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కాల్పుల విరమణకు అమెరికా ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం బ్లింకెన్ గాజాలో పర్యటించడానికి ముందు ఈ దాడులు జరగడం గమనార్హం.! కాగా.. సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో బ్లింకెన్ భేటీకానున్నారు.

కోస్ట్‌గార్డ్ డీజీ రాకేష్ పాల్ హఠాన్మరణం

- సమర్థుడైన అధికారిని కోల్పోయాం: రాజ్‌నాథ్ సింగ్



రాకేష్ పాల్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ రాకేష్ పాల్(58) గుండెపోటుతో మరణించారు. ఆదివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు కోస్ట్‌గార్డ్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అనంతరం కొద్దిసేపటికే ఆయన మరణించారు. విషయం తెలియడంతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రాకేష్ పాల్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన సమర్థవంతమైన, నిబద్ధతతో కూడిన అధికారి అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఐసీజీ 25వ డైరెక్టర్ జనరల్‌గా రాకేష్ పాల్ గతేడాది జూలై 19న బాధ్యతలు స్వీకరించారు. ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్ అణు కేంద్రానికి సమీపంలో డ్రోన్ దాడి

- ప్లాంట్ భద్రతపై అణు ఇంధన సంస్థ ఆందోళన
- ఉభయులూ సంయమనం పాటించాలని ఐఏఈఏ విజ్ఞప్తి

కీవ్, ఆగస్టు 18: ఉక్రెయిన్‌కు చెందిన అణు కేంద్రం భద్రతపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న జపోరిజియాలోని ఈ అణు కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి జరగడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రాఫెల్ మారియానో గ్రోసీ తెలిపిన మేరకు ఈ అణు కేంద్రం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ ప్లాంట్ సిబ్బంది ఉపయోగించే రోడ్డుపై ఉక్రెయినే ఈ డ్రోన్ దాడికి దిగిందని రష్యా మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ప్లాంట్‌కు చెందిన కూలింగ్ స్ప్రింక్లర్స్‌కు సమీపంలో, 750 కిలోవాట్ల పవర్ లైన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలో ఈ డ్రోన్ ద్వారా పేలుడు జరపడం కలవరపెడుతోందని, ఇప్పటికైనా ఉభయ పక్షాలు సమయమనం పాటించాలని గ్రోసీ విజ్ఞప్తి చేశారు. దాడి జరిగిన ప్రాంతాన్ని తమ బృందం పరిశీలించిందని, డ్రోన్ దాడిలో ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని, అలాగే, అణు కేంద్రానికి చెందిన పరికరాలపైనా ప్రభావమేమీ లేదని గ్రోసి తెలిపారు. ప్లాంట్‌కు చెందిన రెండు మెయిన్ గేట్లకు మధ్య రోడ్డుపై ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. యూరప్‌లోనే అతి పెద్దదైన జపోరిజియాలోని ఈ అణు కేంద్రం ఫిబ్రవరి 2022 నుంచి రష్యా ఆధీనంలోకి వెళ్లింది.

ఆ కార్యాలయాలకు దారేదీ?

- అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఇక్కట్లు
- ఇదీ కాగువాడ గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల తీరు



(పాతపట్నం)

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పలు ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం కేవలం ఆ పార్టీ నేతల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్మించారు తప్ప ప్రజలకు ఉప యోగపడేలా నిర్మించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవనాల నిర్మాణానికి ముందే ఆ కార్యాల యాలకు రోడ్డు సదుపాయం ఉన్న చోట్ల నిర్మించాలి. అయితే దీనిని ఏమాత్రం పట్టించుకోకుండా చేపట్టిన పలు నిర్మాణాలు నేడు వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా కాగువాడలో నిర్మిం చిన సచివాలయం, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, ఆర్బీకే భవనాలను చెప్పుకో వచ్చు. ఈ కార్యాల యాలకు వెళ్లేందుకు అవసరమైన రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో భారత్ నిర్మాణ్ సేవాకేంద్రం, రూ.27 లక్షలతో ఆర్బీకేలు నిర్మించారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ భవనాలకు వెళ్లాలంటే రహదారి లేని దుస్థితి. ప్రజలు ఆయా కార్యాలయాలకు వెళ్లాలంటే మిలు కాలనీ గుండా వెళ్లాలి. కాని ఆ మార్గంలో పెద్ద వాహనాలు వెళ్లేం దుకు అవకాశం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆర్బీకే ఉన్నా అక్కడ సేవలు పొందడం సాధ్యమా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అలాగే విలేజీ హెల్త్ క్లినిక్‌లకు రోగులు ఈ మార్గం గుండా వెళ్లలేని దుస్థితి. నిధులు మంజూరీ విడుదలైనప్పటికీ ఆర్బీకే భవనం ఇంకా అసంపూర్తిగానే ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామసచివాలయం, విలేజి హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం పూర్తయినా బిల్లులు చెల్లించని కారణంగా వాటిని అధికారులకు కాంట్రాక్టర్ అప్పగించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ కార్యాలయాలకు సరైన రోడ్డు సదుపాయం కల్పించి ప్రజలకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కాగువాడలో రహదారి నోచుకోని ప్రభుత్వ భవనాలు



పర్లాం రోడ్డులో ఉప్పరపేట వద్ద కూలిపోయిన వంతెన

వంతెన కూలి ఏడాది..

- ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోని ఉప్పరపేట బ్రిడ్జి
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

(జలుమూరు)

పర్లాం పంచాయతీ ఉప్పరపేట గ్రామం వద్ద వంతెన కూలిపోయి ఏడాదవుతోంది. అయితే నేటికీ వంతెన నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్లాం ఇసుక ర్యాంపు నుంచి అధిక లోడ్లతో లారీలు రాకపోకలు సాగించడంతో గత ఏడాది ఆగస్టు 14న వంతెన కూలిపోయింది. అయితే ఇసుక లారీ కనురెప్ప పాటులో ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటి నుంచి ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డు అదుపూ లేకుండా ఇసుక దోపిడీ జరిగి భారీ వాహనాల్లో ఇసుకను పర్లాం అంధవరం మార్గం నుంచి తరలించడంతో ఈ వంతెన కూలిపోయింది. అప్పటిలో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మించినా వంతెన నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటిలో వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టి హడావుడి చేసినా నేటికీ పనుల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. పర్లాం ర్యాంపు నుంచి ఇసుకను తరలించేందుకు మాకివలస మీదుగా వేరే మార్గం ఉండడంతో ఈ వంతెన ఊసే ప్రజాప్రతినిధులు ఎత్తలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే రమణమూర్తికి వినతిపత్రం ఇస్తున్న సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

నరసన్నపేట: నరసన్నపేట మేజర్ పంచాయతీలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో సుమారు 30 వేల మంది జనాభా నివసిస్తున్నారని, రోజు రోజుకూ పట్టణం విస్తరిస్తున్నందున రైతుబజార్ ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి మార్కెట్ లేకపోవడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సువ్వారి మురళీధర్, గొద్దు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి మకరతోరణం బహూకరణ



కోటబొమ్మాళి: పాకివలస గ్రామంలో కొలువైన శ్రీ కనకదుర్గా దేవికి కొత్తపేట గ్రామానికి చెందిన గుడ్ల గణేష్‌కుమార్, స్వాతి దంపతులు మకర తోరణం బహూకరించారు. దీనిని ఆదివారం ధర్మకర్త సమక్షంలో అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో గెస్ట్ ఫ్యాకల్టీ సంఘ ప్రతినిధులు

టెక్కలి: జిల్లా గెస్ట్ ఫ్యాకల్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చల్లా జగ్గారావు, ప్రధాన కార్యదర్శిగా బడ్డ గణేష్, ఉపాధ్యక్షుడిగా చక్కా రవికుమార్, కోశాధికారిగా వసంతరావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా నర్సింహ మూర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్య క్షుడు జగ్గారావు మాట్లాడుతూ.. గెస్ట్ ఫ్యాకల్టీని పొడిగిస్తూ రెన్యూవల్ జీవో విడుదల చేయ డం ఆనందంగా ఉందన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.37 వేలకు పెంచి ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో గెస్ట్‌ఫ్యాకల్టీలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.

ప్రకృతి సాగుతో ఆదర్శంగా నిలవాలి



జీవామృతం తయారీపై అవగాహన కలిగిస్తున్న దుర్గాప్రసాద్

పాతపట్నం: ప్రకృతి సాగుతో భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ దుర్గాప్రసాద్ అన్నారు. సింగుపురంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం, జీవామృతం తయారీపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. రసాయన ఎరువులతో పంటలకు నష్టం వాటిల్లుతుందని, జీవామృతంతో పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. జీవామృతం ఎరువు కాదని, భూమిలో ఉండే సహజ, సూక్ష్మ జీవులను మేల్కొలిపి పంట ఎదుగుదలకు కావాల్సిన పోషకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాధవి, పురుషోత్తం, ఇందులత, జగన్, నాయకులు నారాయణరావు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సామాజిక సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



రేణుకేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

మెళియాపుట్టి: విద్యాభివృద్ధితో పాటు సామాజిక సేవలు నిర్వహించి ప్రిన్సిపాల్ కవిటి రేణుకేశ్వర రావు గుర్తింపుపొందడం అభినందనీయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దమడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కవిటి రేణుకేశ్వరరావు, భారతి దంపతులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ రేణుకేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని అధ్యాపకులు, ఉద్యోగులు కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా రేణుకేశ్వరరావును గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహనరావు, బీజేపీ నాయకుడు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదనరావు, గిరిజన సంఘం నాయకుడు శాంతారావు, డీటీఎఫ్ నాయకుడు కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కొత్తూరు: అంగూరు గ్రామంలోని కల్వర్టు పనులు చేపట్టి ఇసుక ర్యాంపు నుంచి వాహనాల రాకపోకలను పున రుద్ధరించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇసుక రవాణాతో కుంగిన కల్వర్టు' శీర్షిక తో వచ్చిన కథనానికి అధికారులు స్పం దించారు. కల్వర్టుపై రంధ్రం ఏర్పడడంతో ఇసుక తరలింపు వాహనాలు నిలిచి పోయాయి. దీంతో టెక్కలి ఆర్డీవో సుద ర్శన దొర సదరు ప్రాంతాన్ని సందర్శించారు. పాడైన కల్వర్టుకు యుద్ధప్రాతి పదికన మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు, లారీల డ్రైవర్లు హర్షం వ్యక్తంచేశారు. తహసీల్దార్ బడే పాపారావు, డీటీ సత్యనారాయణ, సర్పంచ్ సిమ్మ మధు, గనుల శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

హిందూ మతోద్ధారకుడు ఛత్రపతి శివాజీ



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

పలాసరూరల్: విదేశీ దాస్య శృంఖలాల నుంచి భారత మాత విముక్తి కోసం పోరాడిన మహా నాయకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, ఆయన హిందూమతోద్ధారకుడిగా పేరొందారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు అన్నా రు. గోపాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17వ శతాబ్దంలో మొఘలుల పాలనలో హిందూమత ప్రాబల్యం తగ్గుతున్న తరుణంలో స్వరాజ్య పేరుతో మరాఠా సైన్యంతో ఏకం చేసి పాలించిన ఘనత శివాజీ మహారాజ్‌కే దక్కిందన్నారు. ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, శివాజీ బాటలో పయనించి హిందూమతోద్ధరణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ విభాగ కార్యవాహ సభ్యుడు డీవీ రమణమూర్తి, భజరంగదళ్ జిల్లా సంయోజక్ రాజశేఖర్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, ఛత్రపతి శివాజీ యువసేన గౌరవాధ్యక్షుడు కొక్కిలి దేవదత్తం, కార్యదర్శి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

ఆహ్లాదం కనుమరుగు

- అధ్వానంగా తయారైన పార్కులు
- పాడైన పిల్లల ఆటల పరికరాలు
- వాకర్లకు మాత్రమే ఉపయోగపడుతున్న వైనం
- ఇదీ పట్టణంలోని పార్కుల దుస్థితి



ముత్యాలమ్మ కోనేరు-నెహ్రూ పార్కు దుస్థితి..

(పలాస)

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రజలకు ఆహ్లాదం కనుమరుగవుతోంది. పట్టణాల్లో పార్కులు ఉన్నా నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు మొలిచి దారుణంగా తయారయ్యాయి. పార్కులు వాకర్లకు ఉపయోగపడుతున్నాయి తప్ప ప్రజలకు ఏమాత్రం ఆహ్లాదం ఇవ్వడం లేదు. ముత్యాలమ్మకోనేరు- నెహ్రూ పార్కు మూడు ఎకరాల స్థలంలో ఉంది. గతంలో ఇక్కడ పార్కు ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా తయారు చేయడంతో నిత్యం సందర్శకులతో కిటకిటలాడేది. పిల్లలకు ప్రత్యేకంగా జారుడు బల్లలు, ఇతర ఆట పరికరాలు ఉండేవి. అయితే గడచిన ఐదేళ్లుగా పాలకులు, అధికారుల పర్యవేక్షణ లేక పోవడం, నిర్వహణను గాలికి వదిలేయడంతో పట్టణ ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో పార్కును సుందరీకరణ పేరుతో ఉన్న ప్రాంతాన్ని పాడు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. చెట్లను తొలగించి గట్లు వేయడంతో పార్కు స్వరూపమే మారిపోయింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కులో ప్రస్తుతం పాదచారులకు మాత్రం వినియోగపడేలా కాలిబాట ఉంది. చెరువులో పూడి కలు తీయడం, నీరు నింపడం, మొక్కల పెంపకం చేపట్ట లేదు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కూర్చు నేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. దీనికి నిధులు వెచ్చించి బాగుచేయాల్సి ఉంది. అదేవిధంగా 27వ వార్డులో భద్రం కోనేరును పార్కుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. అప్పటి టీడీపీ హయాంలో ఈ చెరువును పార్కుగా అభి వృద్ధి చేసిన ఆ తరువాత వచ్చిన పాలకులు దీనిని పట్టించుకోకపోవడంతో పార్కు నామరూపాలు లేకుండా పోయింది. కేవలం ప్రజల స్నానాలకు మాత్రమే ఈ చెరువు ఉపయోగపడుతోంది. అలాగూ పలాస రైల్వేకాలనీలో ఉన్న పార్కును కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. గతంలో చిల్డ్రన్ పార్కుగా ఉన్న దీనిలో కొత్తగా మొక్కలు వేసి విడిచి పెట్టారు. నిర్వహణ లేకపోవడంతో పార్కు స్వరూపం మారి పోయింది. సుమారు లక్ష జనాభా ఉన్న జంట పట్టణాల్లో సాయంత్రం సేదతీరేందుకు అవకాశం లేకుండా పోతోందని పలువురు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

వైద్యవిద్యార్థినిపై హత్యాచారంపై నిరసన ర్యాలీ

వజ్రపుకొత్తూరు: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి వ్యతిరేకంగా ఆదివారం టీడీపీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, నేతలు నెయ్యిల సూర్యనారాయణ, కుత్తంకృష్ణ, శేషు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నరకానికి నకళ్లు.. ఈ రోడ్లు



బురదమయంగా మారిన సవర పద్మాపురం రోడ్డు

హరిపురం: పలు గ్రామాల రోడ్లు నరకానికి నకళ్లుగా తయారయ్యాయి. ఏజెన్సీ ప్రాంతంలోని చీపి-సవర పద్మాపురం రోడ్డు బురదమయంగా తయారై కనీసం నడిచి వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. బుడంబో నుంచి సవర రాజపురం మీదుగా చీపి రోడ్డు గతుకులమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టులోగాం రోడ్డు, మాణిక్యపురం, నర సింగుపురం రహదారి సైతం పాడై ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్లపై గత ఐదేళ్లుగా అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

'యువకుల సంచారంపై అనుమానంగా ఉంది'

- దువ్వాడ వాణి

టెక్కలి, ఆగస్టు 18: శనివారం రాత్రి 10 గంటల తరువాత రోడ్డుపై పదిమంది యువకులు అనుమానాస్పదంగా వాహనాల్లో తిరుగుతుండడంపై అనుమానంగా ఉందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సతీమణి, జడ్పీటీసీ దువ్వాడ వాణి పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆమె మాటల్లోనే.. 'అనుమానాస్పదంగా తిరిగిన వారిలో శ్రీనివాస్ సోదరుడు శ్రీధర్ డ్రైవర్‌తో పాటు హేమాచలం, మరి కొందరు ఉన్నట్లు గుర్తించాం. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశాం. శనివారం అర్ధరాత్రి 2 గంటల తరువాత దివ్వల మాధురి ఈ ఇంటిలోకి దూరిందన్న అనుమానాలున్నాయి. సీసీ ఫుటేజీలు పరిశీలించి ఇంటిలో తనిఖీలు చేపట్టాలని సీఐని కోరాం. పరువు కోసం పోరాటం చేస్తున్నా.. నేనేమీ ఆస్తులు అడగ డం లేదని ఆమె వెల్లడించారు. ఈ వ్యవహారంపై సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని వాణి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మాధురి ఆదివారం సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఆమె మాట ల్లో.. మీ అందరి సపోర్ట్‌తో ధైర్యంగా ఉన్నాను.. హెల్త్ ప్రోబ్లం వచ్చింది. తలలో బ్లడ్ క్లాట్ అవడంతో పాటు రక్తం కొద్దిగా చిమ్ముతోంది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. పది రోజులు తరువాత లైవ్‌లోకి వస్తాను' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నివాసం వద్ద ఆయన సతీమణి వాణి చేపట్టిన న్యాయ పోరాట దీక్ష ఆదివారానికి 11వ రోజుకు చేరుకుంది. కుమార్తె హైందవితో కలిసి దీక్షను కొనసాగించారు.

శివసాగర్ తీరానికి పర్యాటకుల తాకిడి

వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. కుటుంబాలతో సహా చేరుకొని స్నానాలు చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. ప్రతి ఆదివారం కూడా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు పలాస-కాశీబుగ్గకు చెందిన ప్రజలు తరలివచ్చి రోజంతా ఆనందం పొందుతున్నారు. గత ఆదివారం నలుగురు యువకులు సముద్ర స్నానాలు చేస్తూ రాకాశి అలల్లో చిక్కుకోవడంతో స్థానిక మత్స్యకారులు మెరైన్ పోలీసుల సాయంతో బయటపడిన నేపథ్యంలో ఈ ఆదివారం మెరైన్, వజ్రపు కొత్తూరు పోలీసులు తీరంలో గస్తీ ఏర్పాటు చేసి యువకులను సముద్రంలోపలకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. ఆకతాయిలు, మందుబాబులు తీరంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యార్థులకు శ్లోక పఠన పోటీలు

టెక్కలి: విశ్వహిందూ పరిషత్ ప్రఖండ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు కృష్ణాష్టకం, మధురాష్టకం, ప్రార్థనా శ్లోకాలు, అష్టలక్ష్మిస్తుతి పోటీలు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు నాలుగు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యబాబు, కామేశ్వర రెడ్డి, అన్నపూర్ణ, వీరాస్వామి, నాగేశ్వరరావు, మూల తాతయ్య, డీఏ స్టాలిన్, ఆకుల ప్రకాష్, విజయ్ కుమార్, కామేశ్వరరావు, వెంకట రమణమూర్తి, లత తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల తరువాత చేపల మార్కెట్ పనులు



చేపల దుకాణ సముదాయంలో పనులు చేపడుతున్న దృశ్యం

టెక్కలి: చిన్నబజారులోని చేపల మార్కెట్ సముదాయంలో ఐదేళ్ల తరువాత పనులను అధికారులు ప్రారంభించారు. గత టీడీపీ హయాంలో నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మార్కెట్‌కు మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వ్యాసరచన పోటీలు రేపు

వజ్రపుకొత్తూరు: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా మంగళవారం అక్కుపల్లి హైస్కూల్ ఆవరణలో హైస్కూల్ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సిక్కోలు జానపద కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రాచీనజానపద కళా రూపాలు- మానవ జీవితంపై వాటి ప్రభావం' అంశంపై ఈ పోటీ నిర్వహిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 9963708027, 9502963442 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అధికారులు తప్పు చేస్తే సహించను

- ఎమ్మెల్యే రవికుమార్
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

సరుబుజ్జిలి, ఆగస్టు 18: ఆమదాలవలస నియోజకవర్గంలో అధికారులు తప్పు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాదరావు నివేదిక చదివి అనంతరం శాఖల వారీగా చర్చ నిర్వహించారు. పలు శాఖలపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. సింధువాడ గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న మూలసవలాపురం గ్రామ రైతులు ఎరువుల కోసం డబ్బులు కట్టి 45 రోజులు అవుతున్నా ఇప్పటికీ రాలేదని సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తురకపేట గ్రామంలో అరవల పార్వతి అనే మహిళకు భర్త ఉండగానే వితంతు పింఛను అందిస్తున్నారని, ఆధారాలతో సహా సర్పంచ్ అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. మండలంలో పలు గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లను గత వైసీపీ నాయకులు కేసుల్లో ఇరికించారని, వారివద్ద సీజ్ చేసిన బియ్యం బస్తాలు ఎక్కడికి వెళ్లాయని, వాటి వివరాలు నేటికీ అధికారులు చెప్పకపోవడంలో ఆంతర్యమేమిటని షలంత్రి ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ సీఎస్‌డీటీని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో రేషన్ డీలర్లపై నమోదైన కేసుల వివరాలు, సీజ్ చేసిన నిత్యావసర సరుకుల వివరాలతో తన వద్దకు హాజరుకావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చిగురువలసలో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందించపోవడంలో ఆంతర్యమేమిటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తక్షణమే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో గృహ నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న వాటికి గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలుపుదల చేసిందని ఎమ్మెల్యే అన్నారు. వాటికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటుందని, తక్షణమే వాటిని సర్వే చేసి పూర్తి వివరాలను నివేదికల రూపంలో జిల్లా అధికారులకు పంపించాలని హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణను ఆదేశించారు. కొత్తకోట వంశధార మినీ రిజర్వాయర్ గత ఐదేళ్లా పూర్తి నిర్లక్ష్యానికి గురైందని సర్పంచ్ సురవరపు జగదీష్ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో నకిలీ ధ్రువపత్రాలతో సామాజిక పింఛన్లు పొందుతున్న వ్యక్తులను గుర్తించి తక్షణమే నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు విధులు నిర్వహించుకుంటే తనకు ఎటువంటి అభ్యంతరం లేదని, లేకపోతే ప్రస్తుతం బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లిపోవచ్చు అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇసకలపాలెం సర్పంచ్ పల్లి సురేష్ పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గోవింద్ వెంకట శివానందమూర్తి, లావేటి అనీల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను వీడియోలో చూపించిన ఎమ్మెల్యే

అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం తన ఫోన్‌లో వీడియో తీసి రోడ్లు భవనాలశాఖ డీఈకి చూపించారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న గుంతలను ఆయన పరిశీలించి సంబంధిత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకమైన గ్రావెల్‌తో మరమ్మతులు చేయడంపై ఆగ్రహం చెందారు. తక్షణమే రాకపోకలకు అంతరాయం కలగకుండా గ్రావెల్ మెటల్, క్రషర్ పౌడర్‌తో మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ పనులు పర్యవేక్షించాలని ఎస్‌ఐ నిహార్‌కు సూచించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



పుడియా చిన్నా(ఫైల్)

కంచిలి, ఆగస్టు 18: మండలంలోని మఖరాంపురం జంక్షన్ వద్ద సంత సమీపంలో ఆదివారం ఉదయం లారీ ఢీకొని పుడియా చిన్నా(59) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కంచిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండపల్లి పంచాయతీ ఒరియా నారాయణపురం గ్రామానికి చెందిన చిన్నా ప్రతి వారం లాగే ఆదివారం సంతకు కాయగూరలు, మిరపకాయలు పట్టుకుని అమ్మేందుకు వచ్చాడు. ఈక్రమంలో సంత వద్ద రోడ్డు దాటుతుండగా ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. చిన్నా నడుము పైభాగం నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య మాలతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్నా మృతితో ఒరియా నారాయణపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మించాలి

మఖరాంపురం జంక్షన్ వద్ద (ఆదివారం సంత వద్ద) జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

నరసన్నపేట: కాలేజీకి వెళ్తానని బయలుదేరి వెళ్లిన తన భార్య మరలా ఇంటికి రాలేదని పేర్కొంటూ భర్త కె.నరేంద్ర ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పోలాకి మండలం రాళ్ల గోదాయవలసకు చెందిన కె.నరేంద్ర(34)కు పలాస మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన హిమగిరిరావు పెద్ద కుమార్తె కోరాడ సమీర(20)తో 8 నెలల కిందట పెద్దల సమక్షంలో వివాహమైంది. ఈమె పలాసలోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె తన కన్నవారి ఇంటి నుంచి కాలేజీకి వెళుతూ అప్పుడప్పుడు అత్తవారింటి నుంచి కూడా వెళుతూ ఉండేంది. ఈనెల 16న ఉదయం 10.30 గంటలకు ఆమెను మామగారు తమ గ్రామం నుంచి నరసన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌కు వాహనంపై తీసుకువచ్చి దిగబెట్టారు. అక్కడి నుంచి కాలేజీకి బస్సులో వెళ్తానని చెప్పడంతో మామగారు వెళ్లిపోయారు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం సాయంత్రం భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

బుచ్చివాని గెడ్డలో ఆక్రమణలు తొలగిస్తాం



బుచ్చివాని గెడ్డ ఆక్రమణలు పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం: బుచ్చివాని గెడ్డలో ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు అన్నారు. కోటపాలెం వద్ద సర్వే నెంబరు 258-2లో 30 ఎకరాల బుచ్చివాని గెడ్డను కొందరు ఆక్రమించి రోడ్డు, సీసీ కల్వర్టు నిర్మించా రు. దీనిపై వారింతే... పట్టించుకోరు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం వచ్చింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ ప్రసాదరావు, రెవెన్యూ పరిశీలకులు శ్రావణి సిబ్బందితో వెళ్లి బుచ్చివాని గెడ్డను పరిశీలించారు. కొలతలు వేయగా సుమారు 15 ఎకరాల వరకూ పలువురు ఆక్రమణలకు పాల్పడినట్లు గుర్తించారు. అలాగే కొబ్బరి, అరిటి మొక్కలన వేసినట్లు గుర్తించారు. దీనిపై తహసీల్దార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. బుచ్చవాని గెడ్డలో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఒక వ్యక్తి కిలోమీటర్ పైగా బుచ్చివాని గెడ్డ మధ్య నుంచి రోడ్డు వేశారని, అదేవిధంగా భారీ స్థాయిలో సీసీ కల్వర్టు పనులు చేపట్టారన్నారు. ఇప్పటికే ఈ గెడ్డ ఆక్రమణలు ఉన్నత అధికారుల దృష్టిలో ఉందని చెప్పారు. ఆక్రమణలు తొలగిస్తామని, చెరువులు, గెడ్డ వాగులు కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ రోజుకి ఒక అరగంట సేపు ధ్యానం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం ఉత్తరాంధ్ర మెగా శాఖాహర సద్భావన ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ జ్ఞాన మందిరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. శాఖాహరులైతే వారిలో సాత్విక గుణాలు వస్తాయని చెప్పారు. విలువలతో కూడిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ముందుగా డే అండ్ నైట్ నుంచి అంబేద్కర్ ఆడిటోరియం వరకు శాఖాహర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ డైరెక్టర్ (ఒంగోలు) సిద్ధ నాగేశ్వరరావు, ఇస్కాన్ ప్రతినిధి శ్రీనివాస్, గోవింద్, సీనియర్ పిరమిడ్ మాస్టర్ దాట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌కు ఆదరణ పెరగాలి

- అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రంలో, జిల్లాలో బాడీబిల్డింగ్‌కు ఆదరణ పెరగాలని ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అన్నారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రెన్‌గా డాక్టర్ బాడాన దేవభూషణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. స్పోర్ట్స్ కోటాలో క్రీడాకారులకు ఉద్యోగవకాశాలు కల్పించాలన్నది అసోసియేషన్ లక్ష్యమని తెలిపారు. బాడీబిల్డింగ్‌పై ప్రజల్లో తీవ్రమైన అపోహలు ఉన్నాయని, వాటిని విడనాడాలని చెప్పారు. కేవలం ప్రోటీన్‌లో వే ప్రోటీన్, సోయా ప్రోటీన్ మా త్రమే బాడీబిల్డర్లు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యాన గౌరీశంకర్, అరుగుల సంతోష్, బట్న నవీన్, ఎస్.భాస్కరరవు, ఆర్.గణేష్, బి.నాని, బి.అరవింద్, కె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



బాడీబిల్డింగ్‌లో జిల్లా చీఫ్ ప్యాట్రెన్‌ను ఎన్నుకున్న రాష్ట్ర సంఘం ప్రతినిధులు

రక్తదాతలే ప్రాణదాతలు

- ఎమ్మెల్యే గొండు శంకర్



రక్తదానం చేస్తున్న యువతతో ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: రక్తదాతలే నిజమైన ప్రాణదాతలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఆదివారం సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఎన్జీవో హోమ్‌లో చిరంజీవి యువత మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంకర్ హాజరై మాట్లాడారు. చిరంజీవి అభిమానులు నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలో రక్తకొరత అధికంగా ఉన్న సమయంలో వారు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ఎటువంటి అపోహలు వద్దని, మరింత మంది యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మెగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుషరాజు కుటుంబానికి బాండు అందజేస్తున్న స్నేహితులు

కవిటి: అనారోగ్యంతో మృతి చెందిన గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన తెంబూరి కుషరాజు కుటుంబానికి ఆయన స్నేహితులు ఆర్థిక సాయం చేశారు. 1997-98 టెన్త్ బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.50వేలు కుషరాజు కుమార్తె పేరున పోస్టల్ బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ బాండును ఆయన భార్య గీత, కుమార్తె సరస్వతికి ఆదివారం అందజేశారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్.కామేష్, జి.శంకరం, ఎం.జగన్, జి.బాలకృష్ణ, డి.చిన్నయ్య, ఎ.ఉమాపతి, ఎస్.రవి, పి.వెంకటరావు, టి.నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలి

అరసవల్లి: కోల్‌కతాలో యువ వైద్యురాలి హత్యాచార ఘటనపై దేశమంతా కంపిస్తోందని, పని ప్రదేశాల్లో మహిళలకు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఎన్జీజీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొవిడ్ వారియర్స్ అని ప్రశంసించి, సత్కారాలు చేసిన వైద్యులకు ఆసుపత్రుల్లో భద్రత ప్రశ్నార్థకంగా మారడం దారుణమని విచారం వ్యక్తం చేశారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట వారికి భద్రత అనేది కచ్చితంగా ఉండాలని, పని ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్గత కమిటీ, కంప్లెయింట్ కమిటీ, డ్యాష్‌బోర్డు నిర్వహణ ఉండాలని కోరారు. మహిళా ఉద్యోగుల భద్రతకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు.

మశాఖపురంలో 'పొలంబడి'



జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మశాఖపురం గ్రామంలో ఆదివారం వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ద్రవ, జీవామృతం, నీమాస్త్రం తయారు చేసే విధానంపై మండల వ్యవసాయ అధికారి టి.భార్గవి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ఎంటీ సంజీవరావు, యూనిట్ ఇన్‌చార్జి మద్దిల చిట్టిబాబు, వ్యవసాయ సిబ్బంది కె.కుమారి, రూప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: మండలంలోని డి.బొండపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2004-05 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలకు చేరుకుని ఒకచోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులకు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వెంకన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పం చ్‌లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

- ఫైనల్‌కు చేరిన శ్రీకాకుళం, విజయనగరం జట్లు



గుంటూరు, శ్రీకాకుళం మధ్య జరుగుతున్న పోటీ

శ్రీకాకుళం స్పోర్ట్స్: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో అనంతపురంపై శ్రీకాకుళం జట్టు 0-10 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోగా, గుంటూరు జట్టుపై 1-11 తేడాతో విజయనగరం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగంలో కృష్ణాపై విజయనగరం జట్టు 5-1 తేడాతో, గుంటూరుపై శ్రీకాకుళం జట్టు 2-3 తేడాతో విజయాలు సొంతం చేసుకుని ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఉదయం ఫైనల్స్ జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.రమణ పేర్కొన్నారు.

- వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల్లో ఆదివారం రాత్రి జరిగిన క్యాంప్‌ఫైర్ మరింత ఉత్సాహాన్ని నింపింది. రెండురోజుల పాటు ఎంతో చెమటోర్చి కష్టపడి విజయం కోసం తాపత్రయం పడిన క్రీడాకారులు ఈ క్యాంప్‌ఫైర్‌లో మయమరిచి చిందులు వేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు కూడా క్యాంప్‌ఫైర్‌లో పాల్గొన్నారు.

గిరిజనుల భూముల జోలికి రావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వాబ యోగి

బూర్జ: గిరిజనుల భూముల జోలికి వస్తే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి పేర్కొన్నారు. మండలంలోని అడ్డూరిపేట గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్య క్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనులను ఓటర్లగా చూస్తున్నారే తప్ప వారి అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో 12 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు సదుపాయాలు ఈ గ్రామాలకు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి అప్పన్న, సవర శోభన, సింహాచలం, లక్ష్మణ, కృష్ణారావు, సురేష్, ధర్మారావు, గిరిజన మహిళలు, యువత పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



సర్టిఫికెట్లతో నీరజా శిష్య బృందం

శ్రీకాకుళం కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమి (హైదరాబాద్) ఆదివారం విశాఖపట్నం కళాభారతిలో జాతీయ స్థాయి సంగీత, నృత్యోత్సవం-9వ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డా.నీరజా సుబ్రహ్మణ్యం శిష్యులు పలు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన సినీనటులు రాగిణి, సుమనశ్రీ, సంస్థ అధ్యక్షులు విజయ మాధవి చేతులమీదుగా కళాకారులు ధ్రువపత్రాలు అందుకున్నారు. అలాగే నీరజా సుబ్రహ్మణ్యంను సన్మానించారు.

ఎమ్మెల్యే వస్తున్నారని..

- జగనన్న అమ్మఒడి ప్రకటన కనిపించకుండా ఫ్లెక్సీని అతికించిన ఉపాధ్యాయులు

ఆమదాలవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు కావస్తున్నప్పటికీ తాళ్లవలస కేజీబీవీ గోడపై జగనన్న అమ్మఒడి ప్రకటనను మాత్రం అలానే ఉంచారు. శనివారం సాయంత్రం ఆ పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరవుతున్న సమయంలో ముందుగా టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. అయితే, పాఠశాల గోడపై జగనన్న అమ్మఒడి ప్రకటన ఉండడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కేజీబీవీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యేకు కనిపించకుండా జనగన్న అమ్మఒడి పెయింటింగ్‌పై గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ ఫ్లెక్సీని తాత్కాలికంగా అతికించారు. జగనన్న అమ్మఒడి పథకాన్ని కూటమి ప్రభుత్వం తల్లికి వందనంగా పేరుమార్చిన విషయం తెలిసిందే. అయినా జగనన్న అమ్మఒడి పేరే పాఠశాలల గోడలపై ఉండడంపై టీడీపీ నాయకులు ఆక్షేపిస్తున్నారు.



జగనన్న అమ్మఒడి పేరు కనిపించకుండా ఫ్లెక్సీ అంటిస్తున్న దృశ్యం

నేడు జిల్లాలో కేంద్రమంత్రి పర్యటన

కలెక్టరేట్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో 11వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామంలో స్వర్గీయ మెండ భాస్కరరావు వర్థంతి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 80 అడుగుల రోడ్డులోని ప్రజాసదన్‌లో సందర్శకులకు కేంద్ర మంత్రి అందుబాటులో ఉంటారని' కలెక్టర్ తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట రోడ్డు సమీపంలో ఎస్వీఎస్ దాబా పక్కన ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని మెట్టక్కివలస, బొడ్డేపల్లిపేటకు చెందిన ఇద్దరు యువకులతో పాటు దన్నానపేటకు చెందిన ఒక యువకుడు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తుల నుంచి పాటు రూ.46,100 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహంతి సాంస్కృతిక కళా సేవా సంస్థ నూతన కార్యవర్గం

ఇచ్ఛాపురం: మహంతి సాంస్కృతిక కళా సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈదుపురం సత్యసాయి ఆలయ ప్రాంగణలో ఆదివారం ఈఎన్నిక జరిగింది. కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా గొనప లక్ష్మణమూర్తి, అధ్యక్షుడిగా రంగాల జానికిరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా జీరు మోహన్‌రావు, నర్తు గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా తిప్పన దుర్యోధనరెడ్డి, ప్రచార కార్యదర్శిగా చలపరాయి వినోద్‌కుమార్, ఉప కార్యదర్శులుగా కారంగి తులసయ్య, కోశాధికారిగా హేమంత్, ఉప కోశాధికారిగా కారింగి త్రినాథ్, సలహాదారులుగా నరసింహమూర్తి, కృష్ణారావు, జయప్రద, దాలయ్య తదితరులు ఎన్నికయ్యారు.

నేతాజీ జాతీయవాది

ఇచ్ఛాపురం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జాతీయవాది అని, దేశం పట్ల అతని దేశభక్తి చాలామంది భారతీయుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని మాజీ సైనికోద్యోగుల సంఘ సభ్యులు అన్నారు. ఆదివారం యూకాంప్లెక్స్‌లోని మాజీ సైనికోద్యోగుల సంఘ కార్యాలయంలో నేతాజీ వర్ధంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘ కార్యదర్శులు బీఎల్ నారాయణరావు, దక్కత విశ్వనాథరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

శ్రీకాకుళం స్పోర్ట్స్: అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో అండర్-19 విభాగంలో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు సత్తాచాటుతున్నారు. విశాఖపట్నంలోని కేఎస్ఆర్ఎం కాలేజ్ మైదానంలో చిత్తూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మల్టీ డే ఇంటర్ డి స్ట్రిక్ట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు కె.థామస్ రామ్ కుమార్, సుశాంత్ నంబాళ్ల రాణించారు. మొదటి ఇన్నింగ్‌లో చిత్తూరు జిల్లా 289 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు ఓపెనర్లు కె.థామస్ 157 బాల్స్ ఎదుర్కొని 122 పరుగులు, సుశాంత్ 67 బాల్స్‌కు గాను 53 పరుగులు చేశాడు. దీంతో శ్రీకాకుళం జట్టు మూడు వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది.

బాలవికాస్ విద్యార్థులు వేద పఠనం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి పెద్ద మందిరంలో బాలవికాస్ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద మందిరం కన్వీనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బాల వికాస్ విద్యార్థులు వేద పఠనం, సత్యసాయి పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయులు కేవీఎస్.పట్నాయక్, జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జి లాడె చంద్రశేఖర్, బాలవికాస్ ఉపాధ్యాయులు సూరు కవిత, జామి పావని, హర్షిని తదితరులు పాల్గొన్నారు.

సమాజం కోసం కలిసి పనిచేయాలి



యువతికి మెమోంటో అందజేస్తున్న దృశ్యం

సోంపేట: సమాజంలో వెనుకబడి ఉన్న వారికోసం అన్నిసంస్థలు కలిసి పనిచే యాలని శ్రీకాకుళం లాస ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డీఎస్వీ భరద్వాజ్ అన్నారు. వుయ్‌ఫర్‌యు సంస్థ 16వ వార్షికోత్సవాన్ని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులకు ఉన్నత చదువులు చదుకోవాలనే కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితి సహకరించదని, ఇలాంటి వారిని ఆదుకొని ఉన్నత చదువులు అందించేందుకు కృషిచేస్తున్న వుయ్ ఫర్ యు సంస్థను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వూనా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు, డి .జోగారావు, లక్ష్మీనారాయణ, గరుడాచలం అప్పల స్వామి, గుళ్ల రమేష్ తదితరులు ఉన్నారు.